క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కొండాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల సిబ్బంది హాజరై తమ శాఖల పరంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని తెలిపారు.

రేపు కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం

ఉదయగిరి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలుపుకుని పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ ఏఎంసీ డైరెక్టర్‌కు మాతృవియోగం



నివాళులర్పిస్తున్న నాయకులు

వరికుంటపాడు: మండలంలోని తొటలచెరువుపల్లె గ్రామానికి చెందిన ఉదయగిరి ఏఎంసీ మాజీ డైరెక్టర్ దాసరి ఎర్రా ఓబయ్య తల్లి దాసరి లక్ష్మమ్మ అనారోగ్యంతో సోమవారం వేకువజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇతర పార్టీల నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, ఓబయ్యను పరామర్శించారు. సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మందలపు తిరుపతి నాయుడు, ఆవులయ్య, బి.మురళీ, సర్పంచ్‌లు పెదమౌలాలి, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆత్మకూరు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం ఆయన గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో అనేక ప్రముఖ రచయిత పుస్తకాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటలు, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు, విజేతలకు చివరి రోజు 20వ తేదీ బహుమతులు అందజేయనున్నట్లు లైబ్రేరియన్ రాజు పేర్కొన్నారు.

'డాక్టర్ డీఆర్ జీవితకథ' పుస్తకావిష్కరణ నేడు

కావలి: కావలి విశ్వోదయ విద్యాసంస్థల రూపశిల్పి డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి జీవిత కథపై రూపొందించిన 'కావలి తథాగతుడు డాక్టర్ డీఆర్' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు పుస్తక రచయిత్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సీ శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వోదయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జవహర్ భారతి కళాశాలలోని ఎంఎం హాల్‌లో ఉదయం 11.30 గంటలకు పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాలిఫోర్నియాలోని సిలికానాంధ్ర తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మృణాళిని హాజరవుతున్నట్లు వివరించారు.

కొనసాగుతున్న లలితా రుద్ర మహాయజ్ఞం



పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

సంగం: సకల జనులు సుభిక్షంగా ఉండాలని తిరుమనకొండ పీఠాధిపతి రాజరాజేశ్వరానంద స్వామి నేతృత్వంలో రాజరాజేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న లలితా రుద్ర మహాయజ్ఞం సోమవారం 31వ రోజుకు చేరింది. ఆలయంలోని కాశీ విశ్వేశ్వరుడికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవార్లకు సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. లలితా రుద్ర మహాయజ్ఞం దంపతులు కూర్చుని నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు సక్రమంగా పండి సకల జనులు సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది 45 రోజుల పాటు ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ యజ్ఞం చివరి రోజు పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులకు కోర్కెలు తప్పకుండా నెరవేరుతాయని, జిల్లా నలుమూలల నుంచి భక్తులు లలితా రుద్ర మహాయజ్ఞంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పాఠశాలలో పరిశుభ్రత

ఆత్మకూరు: నిత్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాకింగ్, రన్నింగ్ తదితర వ్యాయామాలు చేస్తున్న వారు ఆ పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా సోమవారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన చిన్నా పెద్దా అందరు నడుంబిగించి పాఠశాలలో ఉన్న చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. వారంకోమారు ఇలా చేయాలని నిర్ణయించారు.

అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన

అక్క చెల్లెమ్మల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. స్వయం సహాయ గ్రూపు (ఎస్‌హెచ్‌జీ)లకు బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేసి తద్వారా వారి అభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. బ్యాంక్ రుణాలతో వివిధ రకాల వ్యాపారాలు ప్రారంభించి తద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తోంది.

- ఎస్‌హెచ్‌జీలకు రుణ సహాయం
- చిన్న వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో వ్యాపారవేత్తలుగా రాణిస్తున్న మహిళలు



పొదుపు గ్రూపు సభ్యుల సమావేశం

చేజర్ల: స్వయం సహాయక గ్రూపులు (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి మహిళ.. తనకు అందిన రుణంతో ఏదైనా వ్యాపారం చేపట్టి తద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు డీఆర్‌డీఏ అధికారులు అడుగడుగునా అండగా నిలబడుతున్నారు. గతంలో పొదుపు మహిళలకు రుణాలు ఇచ్చినా అవి కుటుంబ అవసరాలకు వాడుకునే పరిస్థితి ఉండేది. నెల నెలా అష్టకష్టాలు పడి రుణాలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పొదుపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడింది. గతంలో వారు తీసుకున్న రుణాలను వాయిదాల పద్ధతిలో తిరిగి ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇదేకాకుండా అనేక సంక్షేమ పథకాల ద్వారా మహిళ ఖాతాల్లో నేరుగా ఆర్థిక సాయం చేస్తుండడంతో చాలా వరకు అప్పులు చేయాల్సిన పని లేకుండా పోయింది. ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో, పొదుపు రుణాలను వ్యాపారాలకు సద్వినియోగం చేసుకునే వెసులుబాటు లభించింది. రూ. కోట్లాది బ్యాంక్ లింకేజీ రుణాలను ఎస్‌హెచ్‌జీలకు మంజూరు చేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరులో నూతన విధానాన్ని ప్రారంభించారు. గ్రూపు రుణాలతో పాటు వ్యక్తి గత రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టిది. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తున్నారు. అర్హులను ఎంపిక చేసి వారికి రుణాలు మంజూరు చేసేలా డీఆర్డీఏ, బ్యాంక్ అధికారులు చర్యలు చేపట్టారు. చేజర్ల మండలంలో మొత్తం 774 సంఘ బంధాల్లో 8,120 మంది సభ్యులు ఉన్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా పలు పొదుపు సంఘాలకు రుణాలు ఇచ్చారు. స్త్రీనిధి ద్వారా 2022–23 సంవత్సరానికి 130 గ్రూపులకు రూ.2,08,75,000 మేర వివిధ బ్యాంక్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పించారు. సొంతగా వ్యాపారాలు చేయడానికి ముందుకు వచ్చే వారికి అధికారులు తోడ్పాటు అందిస్తున్నారు. 2021–22 ఏడాదిలో సుమారు రూ.2 కోట్ల మేర రుణాలు ఇచ్చారు. పొదుపు గ్రూపు సభ్యుల నుంచి 99.8 శాతం రికవరీ చేశారు. చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు స్వయం సహాయక సంఘాలకు రూ. 2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలకు రుణాలు మంజూరు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పచ్చళ్ల తయారీ, ఫ్యాన్సీ స్టోర్‌లు, పిండి మిల్లులు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్‌హెచ్‌జీలకు రుణాలు మంజూరు చేయడంలో ముప్పతిప్పలు పెట్టే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రతి గ్రూపునకు రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణాలు పొంది సక్రమంగా చెల్లించిన గ్రూపులకు వడ్డీలను వారి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వమే జయ చేస్తోంది. బ్యాంక్ లింకేజీ రుణాలు గ్రామీణ ప్రాంతాల మహిళలను ఆదుకొంటున్నాయి. కొంత మొత్తాన్ని అవసరాకు వినియోగించుకొని మిగిలిన నగదుతో చిన్న వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు.



ఆటో స్పేర్ పార్ట్స్ షాపును ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి (ఫైల్)



చీరల వ్యాపార షాపు



కిరాణా షాపు

చీరల వ్యాపారం పెట్టుకొన్నా..



నేను చిత్తలూరులో రాజరాజేశ్వరి సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నాను. బ్యాంక్ నుంచి స్త్రీనిధి ద్వారా రూ.1,70,000 తీసుకుని మా ఊరులోనే చీరల వ్యాపారం పెట్టుకొన్నాను. చీరలను ఇతర ప్రాంతాల్లో కూడా విక్రయించి ఆదాయం పొందుతున్నాను. డీఆర్‌డీఏ అధికారుల సూచనలు పాటిస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నాను. రుణాన్ని బ్యాంక్‌లో సకాలంలో చెల్లిస్తున్నాను.

– జి.రత్నమ్మ, చిత్తలూరు చేజర్ల మండలం

ఆర్థిక ప్రగతి సాధిస్తున్నాను



చాలా కాలం నుంచి శశికళ పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉన్నాను. రూ.1,50,000 రుణాన్ని తీసుకొన్నాను. బ్యాంక్, స్త్రీనిధి ద్వారా రుణాన్ని పొందాను. కిరాణా షాపు పెట్టుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాను. కరోనా అనంతరం వ్యాపారం బాగా జరుగుతోంది. వచ్చిన ఆదాయంతో షాపును మరింతగా అభివృద్ధి చేసుకుంటున్నాను.

– జి.లక్ష్మి, ఆదూరుపల్లి, చేజర్ల మండలం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు



పొదుపు గూపుల్లో ఉండే సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహకారం అందిస్తున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరములో బ్యాంక్ లింకేజీ రుణాలను వీలైనంత ఎక్కువ మందికి ఇచ్చేలా చూస్తున్నాము. రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా చూస్తున్నాము. రుణాలు తీసుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– చీర్ల సుజన, ఏపీఎం చేజర్ల

ఉపాధ్యాయుడికి జాతీయ అవార్డు



ఉపాధ్యాయుడు శివశంకర్

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శివశంకర్‌ను జాతీయ అవార్డు వరించింది. ఉత్తర ఢిల్లీ కల్చరల్ అకాడమీ నిర్వహించిన పోటీలో ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు డాక్టర్ బింజి నరేంద్రగౌడ్, డాక్టర్ ఆర్ఎంఎస్ అర్జున్ ఈ నెల 19న జరిగే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ఉపాధ్యాయుడికి ఆహ్వానం అందజేశారు. కేవలం ధారంతో ఎక్కడా కత్తిరించకుండా శ్రీకృష్ణదేవరాయల చిత్రాన్ని ఆయన రూపొందించారు. దీంతో ఆయన అవార్డుకు ఎంపికయ్యారు.



ఉపాధ్యాయుడు శివశంకర్ ధారంతో చేసిన శ్రీకృష్ణదేవరాయల ప్రతిమ

కార్తీకమాసం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కావలి: కార్తీకమాసం సందర్భంగా కావలి ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్న డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్తీకమాసంలో శైవక్షేత్రాల దర్శనం సర్వపాపహరణం, పుణ్యప్రదమని భక్తులు భావిస్తుండడంతో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో భద్రంగా, సౌకర్యవంతంగా కార్తీక సోమవారం నాడు ఒకే రోజున పంచారామాలు దర్శించేలా ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ బస్సులు నవంబర్ 17న ఆదివారం రాత్రి 10 గంటలకు కావలిలో బయలుదేరి సోమవారం అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరాలయం, పాలకొల్లులోని క్షీరారామం, సామర్లకోటలోని కుమార భీమారామం దర్శించుకుని మంగళవారం ఉదయం ఏడు గంటలకు కావలి చేరుకుంటాయని వివరించారు. ప్రతి నెలా అరుణాచలంకు వెళుతున్న ప్రత్యేక ఆర్టీసీ బస్సు నవంబర్ 26 తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు కావలిలో బయలుదేరి తిరుపతి, చిత్తూరు మీదుగా వేలూరులోని బంగారు దేవాలయ దర్శనం అనంతరం రాత్రి పది గంటలకు అరుణాచలం చేరుకోనున్నట్లు వివరించారు. గిరిప్రదక్షిణ, దర్శనం అనంతరం 27న ఉదయం ఏడు గంటలకు బయలుదేరి సాయంత్రం నాలుగు గంటలకు కావలి చేరుకోనున్నట్లు వివరించారు. భక్తులు, అయ్యపమాల ధరించిన స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దారు చొరవతో టిడ్కో ఇళ్లకు రేషన్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సమీపంలో ఉన్న టిడ్కో వసతి గృహాల్లో కొంత కాలంగా రేషన్ సక్రమంగా అందక అక్కడ నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వారు పలు ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ రేషన్ కార్డుల ద్వారా అక్కడే రేషన్ సరుకులు అందుకుంటుండేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధి దారులకు ఇళ్లు కేటాయించడంతో సొంత ఇళ్లలోకి వారు తరలివెళ్లారు. దీంతో వారికి ప్రతి నెలా ఠంచనుగా రేషన్ అందడం సాధ్యపడడంలేదు. కొందరు తాము గతంలో అద్దెకున్న ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటుండగా, కొందరు తెచ్చుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ విషయమై తహసీల్దారు జగదీష్‌బాబు దృష్టికి ఇటీవల బాధితులు తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన సోమవారం టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన కార్డు కలిగిన వారందరికీ రేషన్ బియ్యం, సరుకులు పంపిణీ చేయించారు.



ఆత్మకూరు టిడ్కో ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ చేస్తున్న వాహనం

వరికుంటపాడు సొసైటీకి ఇఫ్కో అవార్డు

వరికుంటపాడు: వరికుంటపాడు సొసైటీకి ఇఫ్కో కంపెనీ ఇటీవల అవార్డు ప్రదానం చేసింది. సోమవారం సొసైటీ సీఈఓ రత్తయ్య, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులను కార్యాలయంలో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎం.తిరుపతినాయుడు, జె.హైమారావు అభినందించారు. పలువురు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులకు సకాలంలో ఎరువులు అందించడంలో, రుణాలు మంజూరు చేసి సకాలంలో వసూలు చేయడంలో ప్రథమ స్థానంలో ఉండడం గుర్తించిన ఇఫ్కో కంపెనీ అవార్డు అందించి ఎల్ఈడీ సాంసంగ్ టీవీ, ఆరు కుర్చీలను బహుకరించారన్నారు. అవార్డు రావడం సంతోషకరమన్నారు. అనంతరం టీవీని సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించి అవార్డు వచ్చేందుకు కృషి చేసిన మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



టీవీని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

కావలి: పట్టణంలోని జవహర్ భారతి కళాశాల ఎంఎం హాలులో డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డాక్టర్ డీఆర్ విశ్వోదయా బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో చిన్నారులు సృజనకు పదును పెడుతూ ప్రదర్శించిన ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. ఏకపాత్రాభినయం, బృంద నృత్య ప్రదర్శనలో చిన్నారులు భళా అనిపించారు. ఏకపాత్రాభినయ ప్రదర్శనలో భాగంగా చిన్నారులు తమ ప్రతిభతో స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్తలను ఆవిష్కరింపచేశారు. వక్తృత్వ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్‌రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌గేట్ వద్ద సోమవారం రాత్రి ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తమ వెంట వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడప వద్దని సూచించారు.

మార్పును వివరించేలా ప్రగతిపథం

కావలి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులు, రాష్ట్ర ప్రగతిని వివరించేలా ఈ నెల 18వ తేదీ నుంచి 'జగనన్న ప్రగతిపథం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగనన్న ప్రగతిపథం పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలనలో జరగని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జరిగిన ప్రగతిని వివరించేలా జగనన్న ప్రగతి పథం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. విజయవాడలో ఈ నెల 18న ఐటీ వింగ్ ఆధ్వర్యంలో జగనన్న ప్రగతిరథం పేరుతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, దండా కృష్ణారెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నీలం సాయికుమార్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, షేక్ షాహుల్ హమీద్, నాయుడు రాంప్రసాద్, కుందుర్తి కామయ్య, గంగనగారి శ్రీనివాసులు, తాళ్లూరి మాల్యాద్రి నాయుడు, పరుసు మాల్యాద్రి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ప్రగతి పథం పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

పేదలకు చీరల పంపిణీ

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్, జమీర్ దంపతులు సోమవారం బట్టేపాడు మార్గంలో ఇటుక బట్టీల వద్ద పనులు చేస్తున్న గిరిజన మహిళలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు రమాదేవి, కామాక్షి నాయుడు, గంధళ్ల వేణు, శివకోటారెడ్డి, పార్టీ నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, కొండా చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గిరిజన మహిళలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

దేశమాంబ అమ్మవారికి సహస్ర దీపోత్సవం

అల్లూరు: మండలంలోని నార్త్ మోపూర్‌లో కొలువైన దేశమాంబ అమ్మవారి ఆలయంలో దీపావళి పండగను పురస్కరించుకుని ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవను అత్యంత వేడుకగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం మొత్తం దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



దీపాలతో అలంకరించిన దేశమాంబ అమ్మవారి ఆలయం

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

చేజర్ల: కుమారుడి ఆత్మహత్యాయత్నాన్ని జీర్ణించుకోలేక మనస్థాపంతో విషం తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. మండలంలోని మైపాటివారికండ్రికలో గ్రామానికి చెందిన రైతు మాలపాటి తిరిపాల్‌రెడ్డి (62) కుమారుడు కిషోర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఉద్యోగం పోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన కిషోర్ వారం క్రితం గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతనికి చికిత్స అందించడంతో బాగున్నాడు. మళ్లీ ఇబ్బందిగా ఉండడంతో తొలుత తిరుపతి స్విమ్స్, ఆ తర్వాత చెన్నైకు వైద్యం కోసం తీసుకెళ్లారు. ప్రస్తుతం కిషోర్ పరిస్థితి నిలడకగానే ఉంది. అయితే అక్కడి నుంచి ఇంటికి వస్తున్న కిషోర్ తండ్రి తిరిపాల్ రెడ్డి నాయుడుపేట దగ్గర విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అతన్ని స్థానికులు గూడూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని తరలించారు.

జేవీవీ జిల్లా కార్యవర్గ సమావేశం

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జేవీవీ నేత షేక్ గాజుల ఫారుఖ్‌ఆలీ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ జి.సుధాకర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్, మూఢ నమ్మకాలపై చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని, జిల్లా వార్షిక మహాసభ ఈ ఏడాది డిసెంబర్ 23న జరపాలని, అకౌంట్స్ ప్రక్షాళన చేయాలని, జేవీవీ కార్యాలయ మార్పును చేయాలని, తదితర అంశాలపై తీర్మానాలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు పి.మాల్యాచలం, చక్రపాణి, గౌస్‌బాషా, షేక్ దస్తగిరి అహ్మద్, వైవీ సుబ్బయ్య, బి.శ్రీనివాసులు, పోలయ్య, డీవీ రమణయ్య, లక్ష్మీనారాయణ, జిలానీబాషా, రహంతుజానీ పాల్గొన్నారు.

